సాక్షి
సంగారెడ్డి

సోమవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2023



నువ్వా.. నేనా..
సెంటిమెంట్ 'ఇలాఖా'గా పేరున్న గజ్వేల్‌లో రాజకీయం వేడెక్కింది.
వివరాలు 10లో ▸



మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట
మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.
వివరాలు 11లో ▸



అక్రమ నిర్మాణాల కూల్చివేత
పటాన్‌చెరు మండలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు ఆదివారం కూల్చివేశారు.
వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నేడు కరెంట్ సరఫరా బంద్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం కరెంట్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ మధుసూదన్ తెలిపారు. 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌కు అత్యావసర మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. దీంతో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రంజోల్, పస్తాపూర్, మహీంద్ర కాలనీ, అల్గోల్, దిడ్గి, కొత్తూర్(బి), హుగ్గెల్లి ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల గొడవ

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్ ప్రచారంలో చిన్న గొడవ జరిగింది. ఆదివారం పొల్కంపల్లి, చిన్నచల్మెడ, మల్లారెడ్డిపేట, మల్లికార్జునపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెద్దగోపులారంలో కాంగ్రెస్ నేత మానసపై బీఆర్‌ఎస్ కండువాను సర్పంచ్ కీర్తి కప్పడంతో వివాదం రాజుకుంది. ఇరు వర్గాల నేతలు గొడవ పడ్డారు. అనంతరం ఒకరిపై మరొకరు పోలీస్ కేసు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌పై దాడిని క్రాంతికిరణ్ ఖండించారు. కాగా కిరాణం షాపులో ఉన్న తనను బయటకు పిలిచి బీఆర్‌ఎస్ కండువా వేశారని మానస తెలిపారు. తన మరిది మహేందర్ వచ్చి వారించడంతో గొడవ జరిగిందని పేర్కొన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో క్రాంతికిరణ్‌కు మహిళలు బొట్టుపెట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేశారన్నారు. మూడో సారి కూడా బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములను యజమానులకే చెందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ తోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ప్రగతి సాధించిందని పార్టీ అభ్యర్థి కోనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మద్రి, రాజనెలి, పీచేర్యాగడి, పిచేర్యాగడి తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రచారంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, సొసైటీ చైర్మన్ స్రవంతి రెడ్డి, సీడీసీ చైర్మన్ పెంటారెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నమూనాల సేకరణ



నమూనాలను సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

జహీరాబాద్: మద్యం, కల్లు శాంపిల్స్‌ను ఎక్సైజ్ అధికారులు ల్యాబ్‌కు పంపారు. ఆదివారం పట్టణంలోని బార్లలో, హుగ్గెల్లి, రంజోల్, పస్తాపూర్ గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో నమూనాలను సేకరించామని సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

డాక్టర్ అనంతరెడ్డికి అవార్డు



డాక్టర్ అనంతరెడ్డికి అవార్డు అందజేస్తున్న సునీల్ కుమార్

జోగిపేట (అందోల్): లయన్స్ క్లబ్ జాయింట్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ డాక్టర్ కె. అనంతరెడ్డి ప్రెసిడెన్షియల్ లీడర్ షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం కొంపల్లిలో జరిగిన మల్టిపుల్ కన్వెన్షన్ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ సునీల్ కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రెండింటిపై ఉత్కంఠ



- తేలని ఖేడ్, పటాన్‌చెరు టికెట్లు
- కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో టెన్షన్
- ఇప్పటికే మొదలైన నామినేషన్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో కొన్ని అభ్యర్థిత్వాలపై ఉత్కంఠ వీడటం లేదు. నామినేషన్లకు గడువు దగ్గరకొస్తున్నప్పటికీ ఇంకా కాంగ్రెస్ టికెట్లు ఖరారు కావడం లేదు. జిల్లాలో సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాలకు టికెట్లు ఖరారయ్యాయి. పటాన్‌చెరు, నారాయణఖేడ్ స్థానాలపై మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. వీటిని ఆశిస్తున్న నేతలు ఎవరికి వారే గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. ఖేడ్‌లో పీసీసీ ఉపాధ్యక్షులిద్దరూ సురేష్ షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డి.. పట్టు వీడటం లేదు. ఇటు పటాన్‌చెరు విషయంలోనూ ఇంతే. ఇటీవల ఆ పార్టీలో చేరిన నీలం మధు, కాటా శ్రీనివాస్‌గౌడ్‌ల మధ్య పోటీ నెలకొంది. ఈ రెండు చోట్ల పార్టీ ఎవరి వైపు మొగ్గు చూపుతుందో తేలాల్సి ఉంది. కాగా ఆశావహులు ఢిల్లీలోనే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లాలకు చెందిన ఇద్దరు ముఖ్యనేతలు కూడా ఢిల్లీకి వెళ్లారు.

నామినేషన్ల దాఖలు

నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. పలువురు అభ్యర్థులు నామినేషన్లు సైతం దాఖలు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ రెండు టికెట్లపై స్పష్టత రాకపోవడంతో ఇటు కాంగ్రెస్ అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. పార్టీ శ్రేణుల్లోనూ గందరగోళం ఉంది. కాగా బీఆర్‌ఎస్ మాత్రం సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అభ్యర్థులను ఎప్పుడో ప్రకటించింది. ఇప్పటికే వారు రెండు, మూడు దఫాలు నియోజకవర్గాలను చుట్టేశారు. కానీ ఈ రెండు స్థానాల్లో అభ్యర్థిత్వాలు ఖరారు కాకపోవడంతో ఎప్పుడు ప్రచారం చేయాలో? ఓటర్లను ఎప్పుడు కలువాలో? తెలియని పరిస్థితి నెలకొందనే కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

నేడో, రేపో ప్రకటన

ఒకట్రెండు రోజుల్లో పటాన్‌చెరు, నారాయణఖేడ్ అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయానికి వదిలేశారని తెలుస్తోంది.

వంద శాతం స్లిప్పుల పంపిణీ

- 20లోపు పూర్తి కావాలి
- అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి శరత్ అధికారులకు సూచించారు. ఆదివారం రుద్రారం వద్ద గల గీతం వర్సిటీలో ఉన్న సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లు, నిబంధనలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించడానికి గల నిబంధనలు, కౌంటింగ్ ఏజెంట్ల నియామక నిబంధనలను, అబ్జర్వర్‌లకు సంబంధించి చేసుకోవాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి, ఆర్‌ఓల బాధ్యతలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విధులు నిర్వహించే సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కౌంటింగ్ రూమ్, స్ట్రాంగ్ రూముల వద్ద ఎలా ఉండాలి, సీసీ కెమెరాలు ఏర్పాటు, వీడియోగ్రఫీ చేయడం, ఎప్పుడెప్పుడు ఏమేమి చేయాలన్న వాటిపై రిటర్నింగ్ అధికారులకు తెలిపారు. కౌంటింగ్ హాల్ కు ఎంట్రీ, ఎగ్జిట్ ఉండాలని రెండు వైపులా గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 20లోపు వంద శాతం ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. పీఓ, ఏపీఓల శిక్షణలు పూర్తి చేయాలని, సువిధలో అనుమతులను వెను వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి డీఆర్‌ఓ నగేశ్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అవినాశ్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈ, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

సి–విజిల్‌లో ఫిర్యాదు చేయాలి

ప్రతి పౌరుడు తన దృష్టికి వచ్చిన కోడ్ ఉల్లంఘనలపై సి- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని శరత్ తెలిపారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడటం జరినట్లయితే ఆ ఫొటోలు, లైవ్ వీడియోలను తీసి పంపాలన్నారు.

జహీరాబాద్ నిధులు సిద్దిపేటకు..

- ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం..
- కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ గుర్తుచేసుకున్నారు. ఆదివారం పట్టణంలోని 1, 2, 18, 19వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. అయితే ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను నిలుపుకోవడంలో బీఆర్‌ఎస్ విఫలమైందని విమర్శించారు. ప్రజలు ఆ పార్టీ పాలనతో పూర్తిగా విసిగిపోయారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఉమ్మడి జిల్లా మంత్రి... జహీరాబాద్ నిధులను సిద్దిపేటకు తీసుకెళ్లి అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మాజీ కౌన్సిలర్లు కండెం సుజాత, తాహెరాబేగం, నాయకులు రాములు, శుక్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్, నవీన్‌కుమార్, జాఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు 'చింత' ఉండదు



అభివాదం చేస్తున్న ఎంపీ పాటిల్, శ్రీనివాస్, భిక్షపతి, చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ఈసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించుకోవాలని, ఆయన అందరికీ అందుబాటులో ఉంటారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ మఠం భిక్షపతి ప్రజలను కోరారు. ఆదివారం సంగారెడ్డిలో లింగాయత్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రభాకర్‌తోనే సంగారెడ్డి అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో నియోజకవర్గంలో 10 వేల డబుల్ ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని చింతా ప్రభాకర్ హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మధు శేకర్, కౌన్సిలర్ రామప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాణిక్యం, మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, నాయికోటి రామప్ప, సిద్దేశ్వర్, ఆత్మకూర్ నాగేశ్, శివరాజ్ పాటిల్, బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి సమాజం నాయకులు, పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్‌పై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైనట్లు పోలీసులు ఆదివారం పేర్కొన్నారు. గత నెల 22న మాచిరెడ్డిపల్లిలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి ఓటర్లను ప్రభావితం చేసినట్లు ఫిర్యాదు అందిందని, కాగా సదాశివపేట స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అక్రమాలు

ఖేడ్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి విమర్శ



బీజేపీ నాయకులు అంజిరెడ్డి, దత్తురెడ్డిలకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పుతున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని నారాయణఖేడ్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని మాసాన్‌పల్లి చౌరస్తాలో గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు కోర్ల అంజిరెడ్డి, దత్తురెడ్డి తదితరులు భారీ సంఖ్యలో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన భూపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు ప్రజలను దోచుకుని అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తనను మూడోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు. తొలుత మాసాన్‌పల్లిలో భారీ ర్యాలీ చేపట్టారు. నిజాంపేట మండలం మునిగేపల్లి, రాంచెందర్ తండా, నాణ్యనాయక్ తండా, కల్వనికుంట తండా, శేకలికుంట తండా, రాంరెడ్డిపేట, బల్కంచెల్క తండా, తదితర చోట్ల ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీలు గుర్రపు సుశీల, జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీలు నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్, సర్పంచ్ కమలమ్మ, నాయకులు ఉప్పరి అంజయ్య, గుర్రపు జలందర్, నవాబ్‌పటేలు పాల్గొన్నారు.

కమీషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం నాశనం

నారాయణఖేడ్: కాంగ్రెస్ గెలుపు కోసం నేతలు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.హెచ్.మునియప్ప కోరారు. ఆదివారం ఖేడ్‌కు వచ్చిన సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డి నివాస గృహాల్లో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అగ్రనాయకుల కమీషన్ల కక్కుర్తి మూలంగా కాళేశ్వరం ప్రాజెక్టు నాశనమైందని విమర్శించారు. ఆ పార్టీ ఇంతకు ముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రస్తుతం ఇస్తున్న వాగ్దానాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ పరిపాలన సాగిస్తున్న రాజస్థాన్, కర్ణాటకల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణలోనూ ఇచ్చిన ఆరు గ్యారంటీలను సైతం అమలు చేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకొని అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న కారు
- మృతులు నగరవాసులు
- ఓఆర్‌ఆర్ పై ఘటన



ఘటన స్థలం వద్ద నుజ్జునుజ్జయిన కారు



మహమ్మద్ సయిద్



నుమాన్ అలీ

పటాన్‌చెరు టౌన్: ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బీడీఎస్ సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ గోల్కొండకు చెందిన మహమ్మద్ సయిద్(20), నుమాన్ అలీ(19), హసీం, మజిద్, ఫైజల్ ఆహారం తీసుకునేందుకు కారులో శనివారం రాత్రి సంగారెడ్డి వైపు బయలుదేరారు. పటాన్‌చెరు మండలం కర్ధనూర్ ఓఆర్‌ఆర్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో సయిద్, అలీ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా ముగ్గురికి తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో మజిద్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇద్దరి మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మేసిన మంచు దుప్పటి



జిన్నారంలో ఉదయం 10 గంటలు వరకు మంచు దుప్పటి కప్పేసింది. ఆ తర్వాత సూర్యుడు మంచు పొరలను చీల్చుకుంటూ బయటికొచ్చాడు. అంతవరకు రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బంది పడ్డారు. కాగా ప్రకృతి ప్రేమికులు మాత్రం ఆస్వాదించారు.

\- జిన్నారం(పటాన్‌చెరు)

ఖర్చులపై డేగకన్ను!

- జిల్లాలో వ్యయ పరిశీలకుల పర్యటన
- ఎప్పటికప్పుడు నివేదికల సమర్పణ



నారాయణఖేడ్: ఎన్నికల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు గాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకుల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల పర్యవేక్షణకు గాను ఇతర రాష్ట్రాల సివిల్ సర్వీసు అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. నామినేషన్ల స్వీకరణ నాటి నుంచి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు జిల్లాలో పర్యటించనున్నారు. అభ్యర్థుల చేసే ఖర్చుపై నిశితంగా పరిశీలించనున్నారు. నియోజకవర్గాలకు కేటాయించిన వ్యయ పరిశీలకులకు వసతి కల్పించేందుకు ప్రభుత్వం అతిథిగృహాలను సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లాకు వచ్చిన వీరు ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అభ్యర్థుల ప్రచార సరళి, వ్యయంపై అధికారికంగా రూపొందించిన నివేదికలు, ఇతర ఆధారాలను స్వయంగా పరిశీలిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారి వివరాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. వీరు మొదటి విడతలో నామినేషన్ల దాఖలు పర్వం పూర్తయ్యే వరకు, రెండో విడతలో ఉప సంహరణ తర్వాత నుంచి లెక్కింపు వరకు జిల్లాలో ఉంటారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన 27 రోజుల తర్వాత మరోసారి నియోజకవర్గాల్లో పర్యటిస్తారు.

ముమ్మరంగా తనిఖీలు

ఎన్నికల వేళ జిల్లాలో అభ్యర్థుల ప్రచారాలు జోరందుకున్నాయి. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటర్లకు గాలం వేసేందుకు డబ్బు వెచ్చిస్తున్నారు. మద్యం, ఇతర తాయిలాల ఆశ చూపుతున్నారు. నిర్దేశిత మొత్తం కంటే రెట్టింపు ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదని సమాచారం. ఈ క్రమంలో ప్రచార సరళిని పరిశీలించి ప్రలోభ పర్వానికి అడ్డుకట్ట వేసేందుకు నియోజకవర్గాల్లో నిఘా బృందాల అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తారు. ప్రచారాలు, అభ్యర్థుల ఖర్చులను వీడియోలో చిత్రీకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదిస్తున్నారు.

వీరే జిల్లా పరిశీలకులు

జిల్లాకు ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు.. నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలకు విజయ కృష్ణ, సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్ నియోజకవర్గాలకు కె.పి.జయకర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది. వీరితోపాటు పోలీసుశాఖ తరఫున రాజేశ్‌కుమార్ జిల్లా పరిశీలకులుగా ఉన్నారు.



అధికారులతో పరిశీలకులు విజయకృష్ణ

ఆదివారం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా నియమితులైన జిల్లా వ్యయ పరిశీలకులు విజయ కృష్ణ ఖేడ్ సందర్శించారు. రిటర్నింగ్ అధికారి వెంకటేశ్, డీఎస్పీ వెంకట్‌రెడ్డితోపాటు అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఎన్నికలు, పార్టీల ప్రచార తీరుతెన్నులను పరిశీలించారు.

చెల్లీ.. నీ ఓటు మా ఆయనకే..



బీడీలు చుడుతున్న కొమ్మూరి అరుణ

స్థానికుడైన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డినే ఈ సారి జనగామ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన సతీమణి అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని బైరాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఆరు గ్యారంటీ కార్డుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. ప్రచారంలో భాగంగా అరుణ బీడీలు చుట్టి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కామెడీ జీవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాములు, దాసరి మనోజ్, మ్యాక మల్లేశం పాల్గొన్నారు.

–మద్దూరు(హుస్నాబాద్)

జెండా పట్టు.. బీఆర్‌ఎస్‌కు జై కొట్టు



జెండాలతో నృత్యం చేస్తున్న చిన్నారులు

మండలంలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో ఆదివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఈ రెండు గ్రామాల చిన్నారులు కూడా ప్రచారంలో భాగమయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు, జెండాలు చేతబూని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేశారు. తమ తల్లిదండ్రుల్లాగే తాము కూడా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని చిన్నారులు చెప్పారు.

–నర్సాపూర్ రూరల్

వరి పొలాల్లో.. ప్రచార మోత



బ్రహ్మణపల్లిలో ఓటు వేయాలని రైతులను కోరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బ్రహ్మణపల్లిలో వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించి, కేసీఆర్‌కు ఓటు వేయాలని కోరారు.

–తూప్రాన్

ఓటు కోసం.. కోటి విన్యాసాలు



యువకుడికి గడ్డం గీస్తున్న ఎంపీపీ బాలేశం గౌడ్

ఓటు కోసం నాయకులు కోటి విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ జోరుగా ప్రచారం నిర్వహిస్తుంది. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ బాలేషం గౌడ్ స్థానికంగా ఉన్న ఓ కటింగ్ షాపులో యువకుడికి గడ్డం గీస్తూ కారు గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

–జగదేవ్‌పూర్ (గజ్వేల్)

క్లుప్తంగా

నగదు పట్టివేత

జహీరాబాద్: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.19.90 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. సునీల్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు కారులో డబ్బు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



కూరగాయలు విక్రయిస్తున్న రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–19 నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్, తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్లు నిలవగా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మెదక్, తృతీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు.

నువ్వా.. నేనా!

- సెంటిమెంట్ ఇలాఖా గజ్వేల్‌లో ప్రచార హోరు
- అభివృద్ధి, సంక్షేమంతో బీఆర్‌ఎస్ ముందుకు..
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే ఎజెండాగా బీజేపీ, కాంగ్రెస్
- రోడ్‌షోలు, సభలు, సమావేశాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం




సెంటిమెంట్ 'ఇలాఖా'గా పేరున్న గజ్వేల్‌లో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. వాడవాడలా తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

- గజ్వేల్

రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే గజ్వేల్ ఎన్నో విశేషాలకు నెలవు. ప్రత్యేకించి 1952లో జరిగిన ఎన్నికల్లో మినహా 15సార్లు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిచినా రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం అనవాయితీగా వస్తుంది. ఇదే 'సెంటిమెంట్'ను నమ్ముకొని సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రమంతటా తిరిగే అవసరమున్నా దృష్ట్యా ఆయన ప్రచార బాధ్యతలను పార్టీ యంత్రాంగమే చేపడుతోంది. ఇందుకోసం ఎన్నికల ఇన్‌చార్జులుగా మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలు వ్యవహరిస్తుండగా...సమన్వయ కమిటీ సభ్యులుగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. కేసీఆర్ ప్రాతినిధ్యం ఫలితంగా పదేళ్లలో నియోజకవర్గంలో వచ్చిన మార్పును ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యేకించి ఇక్కడ వేలాది కోట్ల వ్యయంతో నిర్మించిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాలతో పాటు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రింగురోడ్డు, ఎడ్యుకేషన్ హబ్‌వంటి భారీ అభివృద్ధి ప్రాజెక్ట్‌లే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలను వివరిస్తున్నారు. అదేవిధంగా కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల మార్పును సైతం ఓటర్లకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. రోడ్‌షోలు, నృత్యాలతో ఆ పార్టీ నేతలు ఆకట్టుకుంటున్నారు. ప్రత్యేకించి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రచారానికి వెళ్లిన ప్రతీచోట 'గులాబీ జెండాలే రామక్క' పాటపై మహిళలతో కలిసి నృత్యం చేస్తూ ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

బీజేపీ సైతం గట్టిగానే కదన రంగంలోకి దిగింది. ఈ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారం వేగం పెంచారు. ప్రత్యేకించి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇతర ప్యాకేజీల పంపిణీలో నెలకొన్న జాప్యాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట విధ్వంసం జరిగిందని చెబుతూ...పేదలకు చెందిన వేలాది ఎకరాల భూములను లాక్కొని రోడ్డున పడేశారని ప్రచారం చేస్తున్నారు. ఈ కష్టాల నుంచి బయట పడాలంటే బీజేపీ గెలిపించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ సైతం సత్తా చాటేందుకు ప్రయత్నిస్తుంది. ఈ పార్టీ తూంకుంట నర్సారెడ్డి తానూ 2009లో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ప్రజలందరికీ 24గంటలు అందుబాటులో ఉన్నానని, కానీ కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు కనీసం దర్శనం ఇచ్చే పరిస్థితి లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. మరోసారి బీఆర్‌ఎస్ గెలిస్తే కేసీఆర్ నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోదని, స్థానికులు సమస్యల పరిష్కారానికి కలవడానికి ప్రయత్నించినా అది జరగదని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందనే విషయాన్ని కూడా కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. మొత్తానికి గజ్వేల్‌లో ప్రచార పర్వం ఆసక్తికరంగా మారింది. నామినేషన్లు ముగిసిన తర్వాత ప్రచారం తీరు మరింత వేడెక్కె అవకాశాలు కనిపిస్తున్నాయి.



కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దు



ప్రచారంలో పాల్గొన్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు సేనాధిపతి, లావణ్య రవి, జీవన్ రెడ్డి, శ్రీధర్ గుప్తా, శేఖర్, జితేందర్ రెడ్డి, బిక్షపతి, రఘువీర్, బలరాం రెడ్డి, అన్నము రవి, మేఘమాల పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట, పెద్దచింతకుంట గ్రామాల్లో ఆదివారం రాత్రి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, సర్పంచ్ లు సురేష్ గౌడ్, శివకుమార్, మురళి గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియమ్మ రుణం తీర్చుకుందాం



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట మదిర సయ్యద్ నగర్ మైనారిటీ నాయకులు ఆదివారం హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి సోనియమ్మ రుణం తీర్చుకుందామని కోరారు. దుబ్బాకలో మాజీ మంత్రి దివంగత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. తనను దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్వామి, నరేందర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, రవీందర్, నిరంజన్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం



బీజేపీలో చేరుతున్న నాయకులు

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కొండపాక(గజ్వేల్): కుటుంబ పాలనకు చరమ గీతం పాడుదామని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లకుడారం, ఎర్రవల్లి, బొబ్బాయిపల్లి, కొండపాక, తిప్పారం, బందారం, సింగారం, చిన్న కిష్టాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన 250 మంది యువత బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పేరిట వేల కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. తనను గెలిపిస్తే గజ్వేల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మన్నెం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగపూర్, ఇరిగిపల్లి, కలబ్ గూర్, కులాబ్ గూర్, తాళ్ళపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణి, సునీత, కసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

జంగ్ తెలంగాణ

మాయమాటలు నమ్మి గోస పడొద్దు

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీల మాటలను నమ్మి గోస పడొద్దని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో సర్పంచ్ మల్లమారి రవీందర్, గ్రామాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్, డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా తిరుగుతున్నారన్నారు. అధికారం కోసం వస్తున్న ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించాలన్నారు. కుల మతాలకతీతంగా పథకాలు అందిస్తున్న కేసీఆర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, చిట్టి మాధురిరెడ్డి, అనంతుల పద్మ, ప్రశాంత్, నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, రాధాకిషన్‌రెడ్డి, బొద్దుల కనకయ్య, దోమల ఎల్లం పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

కొండపాక(గజ్వేల్): యువత తలుచుకుంటే సాధించనిది లేదని డీసీసీబీ చైర్మన్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, బందారం గ్రామాలకు చెందిన 150 మంది యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్శితులై యువత బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రాణాలకు తెగించి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో నూనె కుమార్, మల్లమారి రవీందర్, ర్యాగల్ల దుర్గయ్య, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, సున్నం భాస్కర్ పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా..

దుబ్బాక: మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరందుకుంది. ధర్మాజీపేటలో ఆదివారం కౌన్సిలర్లు కనకయ్య, స్వామి, బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార పాటలకు కౌన్సిలర్లు, నాయకులు స్టెప్పులు వేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాజమౌళి, భూంరెడ్డి, బాలకృషన్ గౌడ్, వంశీ కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.



ప్రచార పాటలకు నృత్యం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రేమ జంటను కాపాడిన పోలీసులు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడబోతుండగా పోలీసులు చాకచక్యంగా వ్యహరించి రక్షించిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. గోవిందాపూర్‌కు చెందిన స్వామి, మెదక్ జిల్లా రామాయంపేట మండలం బచ్చురాజ్‌పల్లికి చెందిన రేణుక యేడాది కాలంగా ప్రేమించుకున్నారు. ఇటీవలే కులాంతర వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్ ద్వారా స్నేహితులకు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఫోన్‌ను ట్రేస్ చేసి లోకేషన్‌ను తెలుసుకున్నారు. ఎస్‌ఐ చైతన్య కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ప్రేమ జంటను కాపాడారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఆత్మహత్య చేసుకోబోయిన ప్రేమ జంటను కాపాడిన ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి

అవినీతికి కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్



రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

దుబ్బాకటౌన్ : అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన దగాకోరు కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట, మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన ఏపాటిదో మేడిగడ్డ ప్రాజెక్టును చూస్తే తేటతెల్లం అవుతుందన్నారు. అనవసర ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం మండలంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు.

తొగుట(దుబ్బాక): దుబ్బాకలో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాంపురం గ్రామస్తులు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన యువత మార్పు కోరుకుంటుందన్నారు. ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల కూల్చివేత



పటాన్‌చెరు టౌన్: మండలంలోని ప్రోచారం గ్రామ పరిధి పెద్దవాగు బ్రిడ్జి సమీప ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు ఆదివారం కూల్చివేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సంగీత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజా, ఇరిగేషన్ ఏఈ దిలీప్ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్న మూడు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సొంత గూటికి చేరిన మైనార్టీ నాయకుడు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు సయ్యద్ షకీల్ సొంత గూటికి చేరారు. ఈయన బీఆర్‌ఎస్ నుంచి గత నెల 24వ తేదీన జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మంత్రి తన్నీరు హరీశ్‌రావు నివాసానికి వెళ్లి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు.

గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ కృషి

హత్నూర(సంగారెడ్డి): గిరిజన తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో నిర్వహించే బంజారా భేరి సభకు మండలం నుంచి గిరిజనులు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాలు, గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తండాకు రోడ్డు మంజూరు చేయడంతో పాటు తండాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మళ్లీ గెలిచేది బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణ

నారాయణఖేడ్: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కల్పిస్తున్న ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ బాధ్యుడు మహ్మద్ షాహిద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీన ఖేడ్‌లోని ఐకేపీ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు రెండు నెలలు ఉచిత శిక్షణ, భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారికి హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జర్దోషి, టెన్త్ ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులు, నిర్వహణ, గృహోపకరణాల మరమ్మతులు, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి డీటీపీ, ప్రింట్, పబ్లిషింగ్ అసిస్టెంట్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, బీకాం ఉత్తీర్ణులకు అకౌంట్స్ అసిస్టెంట్ (టాలీ) ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 94413 84182, 95538 73340, 95733 98748 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మరో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పెద్దమొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భెల్ మెట్రో కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు అక్టోబర్ 16వ తేదీన మెసేజ్ వచ్చింది. దీంతో తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా రూ.2800 చెల్లించి ఇచ్చిన టాస్కు పూర్తి చేశాడు. తాను పెట్టిన నగదును తనకిచ్చిన వాలెట్‌లో చూపుతూ వచ్చారు. దీంతో బాధితుడు మొత్తం రూ.12 లక్షలు చెల్లించగా, అదే క్రమంలో సైబర్ నేరగాళ్లు కమీషన్ కూడా చూపుతూ వచ్చారు. చివరకు తాను పెట్టిన నగదు, కమీషన్ ఇవ్వాలని కోరడంతో వారు స్పందించలేదు. తాను మోసపోయానని బాధితుడు గ్రహించి సైబర్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఇందేశంలో ఇంటింటి ప్రచారం
- మహిపాల్ రెడ్డికి మద్దతు తెలిపిన వెలమ, రాయలసీమ సంఘం
- రామచంద్రాపురంలో బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



పటాన్‌చెరులో మైనార్టీ సమ్మేళనంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు పెద్దపీట వేస్తుందని ఇందుకు పటాన్‌చెరు నియోజకవర్గం ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి నిర్వహించిన పటాన్‌చెరు మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ భారీగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. తన సొంత నిధులతో వందకుపైగా మసీదులు, దర్గాలు, ఐదు ఎకరాల్లో కబ్రస్తాన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

వెలమ సంక్షేమ సంఘం ఏకగ్రీవ మద్దతు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వివిధ కుల సంఘాల ఏకగ్రీవ మద్దతులు కొనసాగుతున్నాయి. తాజాగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వెలమ సంక్షేమ సంఘం ఎమ్మెల్యేకు ఏకగ్రీవ మద్దతు పలికింది. ఆదివారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన వెలమ సంక్షేమ సంఘం (అమీన్‌పూర్) ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం భేదం చూపకుండా సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

రాయలసీమ సంక్షేమ సంఘం..

పటాన్‌చెరు టౌన్: తెలంగాణలో నివసించేవారు తెలంగాణ బిడ్డలేనని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన రాయలసీమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం వచ్చి పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారందరి అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్ పార్టీ బాధ్యతని అన్నారు.

ఇంద్రేశంలో ప్రచారం..

పటాన్‌చెరు: మండలంలోని ఇంద్రేశం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శ్రీ సాయి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీలోని ఇంటింటికి వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ఇంద్రేశం గ్రామ పరిధిలో రూ.20 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

రాష్ట్ర ఏర్పాటులో యువత పాత్ర కీలకం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన యువత నేడు బంగారు తెలంగాణ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషిస్తోందని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన టిల్లు, కార్తీక్, శ్రీకాంత్, ప్రమీల, తదితరులు తమ అనుచరులతో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జీఎంఆర్ సెంటర్‌లో అమీన్‌పూర్ మండలం సుల్తాన్ పూర్, పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల, క్యాసారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వివిధ కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు క్షత్రియులు, పటాన్‌చెరులో శ్రీకాకుళం సంక్షేమ సంఘం, శెట్టిబలిజ, వీరశైవలింగాయత్ కులస్తులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యారు. జీఎంఆర్‌కు కులసంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.



ఇంద్రేశంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



రామచంద్రాపురం బొంబాయి కాలనీలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజయానికి సహకరిస్తామని పటాన్‌చెరు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ కులస్తులు ప్రకటించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంపై పూర్తి నమ్మకంతో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి అగ్నికుల క్షత్రియులు ఏకగ్రీవ మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

భక్తి మార్గంలో నడవాలి

జహీరాబాద్ టౌన్: ప్రతీ ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని దత్తగిరి కాలనీలో నగర సంకీర్తన నిర్వహించారు. పంచముఖి హనుమాన్ మందిరం వరకు కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు భగవద్గీత, రామాయణం ప్రాముఖ్యత వివరించారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

గొల్ల కురుమలకు సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్: గొల్ల కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేసిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన గొల్లకురుమ యాదవ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘం భవనానికి 23 గుంటల భూమి కేటాయించడమే కాకుండా రూ.1.20 కోట్ల నిధులను సర్కార్ ఇచ్చిందన్నారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ తన్వీర్, బేవరేజెస్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని రాణాపూర్ సమీపంలో అనుమతులులేని వెంచర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ సమీప కుంట కట్టను కబ్జాను చేయడమే కాకుండా ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి ప్లాట్లు, గుంటలుగా విక్రయిస్తున్నారన్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌ను వివరణ కోరగా వెంచర్లు వేసుకుని అమ్ముకుంటున్నారని, తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొనడం గమనార్హం.



రాణాపూర్‌లోని కుంటలో వేసిన అక్రమ వెంచర్

ఉచిత విద్య, వైద్యం బీఎస్పీ నినాదం

నారాయణఖేడ్: ఉచిత విద్య, వైద్యం బీఎస్పీ నినాదం అని ఆ పార్టీ నారాయణఖేడ్ అభ్యర్థి మహమ్మద్ అల్లావుద్దీన్ పటేల్ అన్నారు. నారాయణఖేడ్‌లోని పార్టీ కార్యాయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాణ్యమైన విద్యతో పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. చాలా దేశాల్లో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం కొంతమందికే ప్రయోజనం చేకూరిందని విమర్శించారు. తనకు ఖేడ్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని, ప్రవీణ్‌కుమార్‌ను సీఎం చేస్తామని, మంచి పరిపాలన రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఇన్‌చార్జి పండరి, చేరికల కమిటీ చైర్మన్ హన్మంతు, ఆయా మండలాల బాధ్యులు శంకర్, సాయిలు, మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి మహ్మద్ అల్లావుద్దీన్ పటేల్

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీధర్ యాదవ్

హత్నూర(సంగారెడ్డి): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ నర్సాపూర్ అభ్యర్థి మురళీధర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని షేర్ ఖాన్ పల్లి, రొయ్యపల్లి, కొడిపాక, నాగారం, తదితర గ్రామాలలో ఆయన సతీమణి, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణితో కలిసి పలుగు పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ యాదవ్ మాట్లాడుతూ సునితా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. అలాగే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సైతం గ్రామాల అభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు తనను గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మురళీధర్ యాదవ్‌కు హారతి ఇస్తున్న మహిళ

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: ఝరాసంగం మండలంలోని ఈదుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ బసవరాజ్ పాటిల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పండరినాథ్‌లు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని కానుకుంట గండమ్మ నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు వివరాలు పక్కాగా నమోదు చేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు జయకర్

జోగిపేట(అందోల్): ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల రోజువారీ ఖర్చు వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు కె.పి.జయకర్ ఎన్నికల అధికారులకు సూచించారు. ఆదివారం అందోల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నిర్వహించే సభలు, ర్యాలీలు తదితర ఖర్చుల వివరాలు ప్రతీ రోజు నమోదు చేయాలని సహాయ వ్యయ పరిశీలకుడు పూల్ సింగ్‌కి సూచించారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు, నోడల్ అధికారి, తహసీల్దార్ ఆంతోని, సీఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ బాలాజీ

మహాయాగం కోసం భూమిపూజ

నారాయణఖేడ్: మాధవానంద సరస్వతి ఆశీస్సులతో ఖేడ్ పట్టణ పురోహితుడు మోహన్‌జోషి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ దుర్గాభవానీ మాత ఆలయ సమీపంలో ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకు మహారుద్ర సహిత శతచండీయాగ పురస్సర చతుర్వేది స్వాహాకార సుదర్శన మహాయాగం నిర్వహించనున్నారు. ఆదివారం అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ యాగస్థలికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సంగ్రాం మహారాజ్

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ పార్టీకే మద్దతు

మనూరు(నారాయణఖేడ్): నారాయణఖేడ్ ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని ఆ పార్టీ మనూరు మండల కన్వీనర్ సుభాష్‌రావు పాటిల్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయింపులో ఖేడ్‌ను మూడో జాబితాలో చేర్చడంపై కార్యకర్తలు తీవ్ర ఉద్వేగంలో ఉన్నారన్నారు. పార్టీకి ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం కృషిచేస్తామన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక



నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం కోలపల్లికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బేగరి సాయిలు, ఇతర బాధ్యులు ఆదివారం ఖేడ్‌లో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

◆ స్నేహితుడి కుటుంబానికి చేయూత

రాయికోడ్(అందోల్): మండలంలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన ఎస్.అశోక్ అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. మృతుడి బాల్య స్నేహితులు బబ్లూ, శ్యామ్, సంతోష్, అశోక్ కుమార్, వీరేశం, జగన్నాథ్, శివ, అశోక్, యాదుల్ తదితరులు అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రేపల్లి చిన్న భూమయ్య ఆదివారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష దామోదర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని ఓదార్చారు.

◆ పార్టీకి రాజీనామా చేయండి



జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ చేరిన బీజేపీ ప్రజాప్రతినిధుల తీరుపై ఆ పార్టీ నాయకుడు రవీందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బొల్లారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీజేపీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరటం సరికాదన్నారు. పార్టీ గుర్తుమీద గెలిచి బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లటం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే బీజేపీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

◆ బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలోని ఆయా వార్డుల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 20, 26వ వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో కౌన్సిలర్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొడకంచి, నల్తూర్, లక్ష్మీపతిగూడెం, వావిలాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



◆ సత్యసాయి పల్లకీ సేవ



నారాయణఖేడ్: భగవాన్ సత్యసాయి జయంతి ఆదివారం వైభవంగా జరిగింది. జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో సత్యసాయి పల్లకీసేవ నిర్వహించారు. పల్లకీ సేవలో భక్తులు కీర్తనలు ఆలపించారు. అంతకు ముందు సత్యసాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏటా సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు.

◆ బీజేపీ అభ్యర్థికి సత్కారం



జహీరాబాద్: బీజేపీ టికెట్ పొందిన రాంచందర్ రాజనర్సింహకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం జహీరాబాద్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ మంత్రిని కలిసిన పట్నం రవితేజ



సంగారెడ్డి: హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో పట్నం రవితేజ ఆదివారం కలిశారు. మంత్రి ఆయనకు సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి గెలుపు కోసం పలు సూచనలు ఇచ్చారు. రాబోవు రోజుల్లో సంగారెడ్డి నియోజకవర్గ యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని రవితేజ తెలిపారు.